క్లుప్తంగా

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన



వెల్దుర్తిలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వచ్ఛత పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. చెత్త రహిత భారతదేశ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సాంబయ్య పేర్కొన్నారు.

ఖోఖోలో గురుకుల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణ కిషోర్

నర్సాపూర్: జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ఖోఖో పోటీలో రాణించారని స్థానిక అల్లూరి సీతారామరాజు గిరిజన పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణ కిషోర్ శుక్రవారం చెప్పారు. జిల్లా స్థాయి ఖోఖో పోటీలో తమ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారని ఆయన వివరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్ కృష్ణకిషోర్, వైస్ ప్రిన్సిపాల్ బసవరాజ్, పీఈటీ లింగం తదితరులు అభినందించారు.

'పేట'లో కుక్కల బెడద

మహిళపై దాడి, గాయాలు

రామాయంపేట(మెదక్): రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో శునకాల బెడద తీవ్రతరమవుతోంది. ఇప్పటికే వాటి దాడిలో పలువురు గాయపడగా, తాజాగా శుక్రవారం దుర్గమ్మ బస్తీలో నాగలక్ష్మిపై దాడిచేశాయి. గాయాలపాలైన ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుక్కల బెడదను అరికట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

గ్రామాల్లో ఎంపీడీఓల క్షేత్రస్థాయి పర్యటన



చిన్నశివునూర్‌లో సెగ్రిగేషన్ షెడ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓలు

చేగుంట(తూప్రాన్): ఇటీవల గ్రూపు2 పరీక్షల్లో ఉద్యోగం పొందిన ఎంపీడీఓలు క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా శుక్రవారం చేగుంట మండలంలోని పలు గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల ఆధ్వర్యంలో ఉపాధిహామీ పనులతో పాటు గ్రామాభివృద్ధి అంశాల గురించి తెలుసుకున్నారు. ఇంకుడు గుంతలు, సెగ్రిగేషన్ షెడ్‌ల నిర్మాణం, వ్యవసాయ సంబంధిత పనులు, రోడ్ల నిర్మాణం, నర్సరీల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. సీఈఓ అనిల్ కుమార్ వారికి అవగాహన కల్పించారు. స్థానిక ఎంపీడీఓ చిన్నారెడ్డి, ఎంపీఓ నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పోటీలతో సృజనాత్మకత వృద్ధి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె

నర్సాపూర్: పోటీలతో విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందుతుందని స్థానిక బీవీరాజు ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్ దూబె చెప్పారు. కాలేజీలో శుక్రవారం నిర్వహించిన అస్త్ర -2025 జాతీయస్థాయి సృజనాత్మకత ఆవిష్కరణ ప్రతిభ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రసాయనిక రియాక్షన్ కార్ పోటీలు తొలిసారిగా తమ కాలేజీలో జరుగుతున్నాయని ఆయన చెప్పారు. ప్రతిభ కనబరిచేందుకు విద్యార్థులకు తమ కాలేజీలోని కెమికల్ విభాగంలో రెండు రోజులపాటు పోటీలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, కెమికల్ ఇంజనీరింగ్ హెడ్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

రామాయంపేట(మెదక్): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన మండలంలోని ప్రగతి ధర్మారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రాఘవిని శుక్రవారం ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ మేరకు స్కూలులో జరిగిన సమావేశంలో గ్రామస్తులతో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. రాఘవి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణమని గ్రామస్తులు పేర్కొన్నారు. రాఘవితోపాటు ఆమె తల్లిదండ్రులను, పాఠశాల పీఈటీ కిరణ్‌ను సన్మానించారు.

శిథిల భవనాలు

సొంత భవనాలు మరమ్మతు చేయరు

- అద్దె భవనాలలో కార్యాలయాలు
- ప్రజాధనం వృథాపై ప్రజల మండిపాటు



అల్లాదుర్గంలో శిథిలమైన పీఏసీఎస్ భవనం

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ భవనాలు శిథిలమవుతున్నాయి. కనీస మరమ్మతు చేయకపోవడంతో అవి కూలిపోతున్నాయి. భవనాలు మరమ్మతులు చేయక అద్దె భవనాలు తీసుకుని కార్యాలయాలను కొనసాగిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య తగ్గడంతో సాంఘిక సంక్షేమ హాస్టళ్లను ఎత్తివేశారు. దీంతో భవనాలు వృథాగా మారాయి. ఈ భవనాలు వినియోగించక పోవడంతో శిథిలమై కూలిపోయాయి. అల్లాదుర్గం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం భవనం శిథిలావస్థకు చేరుకుంది. దశాబ్ద కాలంగా భవనం శిథిలమవుతుంటే అధికారులు, పాలక వర్గం ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. భవనం శిథిలమైందని పాలక వర్గం భవనాన్ని వదిలివేసి, అద్దె భవనంలో కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. నూతన భవనం నిర్మించేందుకు పాలక వర్గం సిద్ధమై శంకుస్థాపన చేశారు. నిధులు లేవని నిర్మాణం పనులు చేపట్టలేదు. అల్లాదుర్గం పట్టణంలో రెండు దశాబ్దాల క్రితం వందల మంది విద్యార్థులతో ఎస్సీ బాలుర హాస్టల్ కళకళలాడింది. క్రమేణ హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుండటంతో, విద్యార్థుల సంఖ్య తగ్గిందని హాస్టల్‌ను ఎత్తివేశారు. దీంతో భవనం వృథాగా మారి పూర్తిగా కూలిపోయింది. గడిపెద్దాపూర్‌లో బాలుర బీసీ హాస్టల్ సైతం విద్యార్థులు లేరని ఎత్తి వేశారు. ఈ భవనం సైతం శిథిలావస్థకు చేరుకుంది. అల్లాదుర్గంలో ఎస్సీ బాలికల వసతి గృహం కరోనా నుంచి విద్యార్థినిల సంఖ్య తగ్గడంతో ఈ హాస్టల్‌ను ఎత్తివేశారు. భవనం కొన్నేళ్లు వృథాగా ఉంది. అల్లాదుర్గం జూనియర్ సివిల్, ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు మంజూరైంది. కోర్టుకు భవనం లేక పోవడంతో, ఎత్తి వేసిన బాలికల హాస్టల్‌ను ఇవ్వడంతో కోర్టు కొనసాగుతుంది. శిథిలమైన భవనాలను సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో కూలిపోయాయి. ఇప్పటికైనా ఈ భవనాలపై దృష్టి పెట్టి ఇతర భవనాలను నిర్మించేందుకు స్థలాలను కేటాయిస్తే ఉపయోగంలోకి వస్తాయని స్థానికులు చెబుతున్నారు.

చదువుతోపాటు క్రీడలు ముఖ్యం

ఎంజేపీ గురుకుల పాఠశాల జిల్లా కన్వీనర్ హరిబాబు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని ఎంజేపీ బీసీగురుకుల పాఠశాల జిల్లా కన్వీనర్, తునికి ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ హరిబాబు తెలిపారు. ఎస్‌జీఎఫ్ క్రీడలలో తునికి ఎంజేపీ విద్యార్థులు అండర్ 14, అండర్ 17 విభాగం ఖోఖో పోటీలలో జిల్లాప్రథమ స్థానం సాధించినందుకు శుక్రవారం గురుకుల పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమని పేర్కొన్నారు. అలాగే క్రమశిక్షణ ఎంతో అవసరమని, లక్ష్యం నిర్దేశించుకుని ఇష్టంతో శ్రద్ధగా చదవాలన్నారు. క్రీడలలో రాణిస్తే ఉన్నత శిఖరాలకు చేరవచ్చని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో పీడీ అంజలి, పీఈటీలు కార్తీక్, శేఖర్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు తెరుచుకున్న బడి

విధులకు హాజరైన టీచర్ శ్రీదేవి

సాక్షి ఎఫెక్ట్..



ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తెరిచిన ఉపాధ్యాయురాలు శ్రీదేవి, సీఆర్‌పీ సంతోష్ గుప్తా

రేగోడ్(మెదక్): రెండేళ్లుగా టీచర్ విధులకు హాజరుకాకపోవడంతో రేగోడ్ మండలం రంజానాయక్ తండా పాఠశాలకు తాళం పడింది. ఈనెల 16న ‘సాక్షి’లో ‘విధులకు డుమ్మా’, శీర్షికపై కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ విషయమై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. విధుల పట్ల ఆమె నిర్లక్ష్య వైఖరిపై అధికారులు డిప్యుటేషన్‌ను నిలిపివేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం హుటాహుటిన రంజానాయక్ తండా పాఠశాల ఉపాధ్యాయురాలు శ్రీదేవి విధులకు హాజరయ్యారు. పాఠశాలను తెరిచి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

నిధులపై విచారణ ఏదీ?

రంజానాయక్ తండా, తిమ్మాపూర్ పాఠశాలలో గ్రాంట్ స్వాహా అయ్యాయని వస్తున్న ఆరోపణలపై అధికారులు ప్రేక్షక పాత్ర వహించడం వెనుక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కలెక్టర్ స్పందించి నిధులు స్వాహాపై విచారణపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పౌల్ట్రీ ఫారం యజమానికి నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

నర్సాపూర్‌రూరల్: కంపు భరించలేకపోతున్నాం అనే శీర్షికన శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి పౌల్ట్రీఫారమ్ యజమానికి నోటీసులు ఇచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో గ్రామ కార్యదర్శి శైలజ శుక్రవారం ఉదయం పంచాయతీ సిబ్బందితో కలిసి నోటీసులు ఇచ్చేందుకు వెళ్లారు. పౌల్ట్రీ ఫామ్‌లోనికి వెళ్లనివ్వకపోవడంతో గేటుకు నోటీసులు అతికించారు. చర్యలు తీసుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీఓ వైద్య శ్రీనివాస్ హెచ్చరించారు.



పౌల్ట్రీ ఫారమ్ గేటుకు అతికించిన నోటీస్

సాక్షిపై ఏపీ పోలీసుల వేధింపులు ఆపాలి



ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

నర్సాపూర్ రూరల్: సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డిపై ఏపీ పోలీసుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ నర్సాపూర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ర్యాలీ నిర్వహించారు. కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రిక స్వేచ్ఛకు భంగం కల్పిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ సంఘాల నాయకులు జి.భిక్షపతి, వెంకటేష్ గౌడ్, పి.ఆనంద్, అశోక్ రెడ్డి, మహేష్, శ్రీశైలం, బబ్బూరి సుధాకర్, అచ్చంపేట భిక్షపతి, మహేష్ చారి, సబ్బు, వినోద్, ఆకుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తులు సత్‌ప్రవర్తనతో మెలగాలి

అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి

టేక్మాల్(మెదక్): గ్రామాల్లోని పాతనేరస్తులు సత్‌ప్రవర్తనతో మెలగాలని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి సూచించారు. మండల కేంద్రమైన టేక్మాల్ పోలీస్ స్టేషన్‌లో హిస్టరీ షీటర్స్‌కు శుక్రవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిస్టరీ షీటర్స్‌పై ప్రత్యేక నిఘా ఉంటుందని జాగ్రత్తగా మెలగాలన్నారు. ఏమాత్రం అనుమానం వచ్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలుకు దూరంగా ఉండాలని, నేరాల నియంత్రణకు సహకరించాలని కోరారు. టేక్మాల్ ఎస్‌ఐ రాజేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కేసీఆర్ కాలనీ సంక్షేమ సంఘం సమావేశం

రామాయంపేట(మెదక్): కేసీఆర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు శుక్రవారం సమావేశమై కాలనీలో నెలకొన్న సమస్యల విషయమై చర్చించారు. రహదారి, మురుగు కాలువల సదుపాయం లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందుల పాలవుతున్నారని వారు వాపోయారు. ఎమ్మెల్యే వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా కట్ట ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

◆ పత్తి రైతులు స్లాట్ బుక్ చేసుకోవాలి

కొల్చారం(నర్సాపూర్): మండలంలో పత్తి పంట సాగు చేసిన రైతులు పత్తి అమ్ముకునేందుకు ముందస్తుగా స్లాట్ బుక్ చేసుకోవాలని ఏఓ శ్వేత కుమారి సూచించారు. లేకుంటే పత్తిని నేరుగా అమ్ముకునేందుకు అవకాశం లేదన్నారు. మొబైల్ ద్వారా ఈ స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుందని, మరిన్ని వివరాల కోసం గ్రామాలకు చెందిన ఏఈఓ లను సంప్రదించాలని సూచించారు.

◆ విద్యుత్ సరఫరాలో అంతరాయం

చేగుంట(తూప్రాన్): మండలంలోని కసాన్‌పల్లి చందాయిపేట 33 కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు రామాయంపేట ఏడీఏ ఆదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

కేజీబీవీ ప్రిన్సిపాల్ బాలమణి



టేక్మాల్ కేజీబీవీలో ప్రతిజ్ఞ చేయిస్తున్న టీచర్లు

టేక్మాల్(మెదక్): వ్యక్తిగత పరిశుభ్రతతో పాటూ పరిసరాల పరిశ్రుభ్రత పాటించాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ బాలమణి సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన టేక్మాల్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో స్వచ్ఛ తెలంగాణ ప్రతిజ్ఞ విద్యార్థులచే చేయించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నిత్యం పరిశుభ్రత కార్యక్రమానికి సమయాన్ని కేటాయించాలన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల టీచర్లు గురుశ్యామల, మౌనిక, మోక్షిక, నవనీత, సంధ్య, సుప్రియ, సుజాత, సంతోషి తదితరులతో పాటూ విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాంక్ లావాదేవీలపై అవగాహన

మోడల్ విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన




తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండల కేంద్రంలో తెలంగాణ మోడల్‌స్కూల్ ఐటీ విద్యార్థులు శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఐటీ టీచర్ ప్రమోద్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌బీఐ బ్యాంకును సందర్శించి లావాదేవీలపై అవగాహన పొందారు. రైతులకు పంట రుణాలు, స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలతో పాటు రోజువారి లావాదేవీలపై వివరించారు. బ్యాంకులో డబ్బులు జమ చేయడం, విత్‌డ్రా చేయడం వాటిని సాంకేతిక నిర్వహణపై బ్యాంకు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ మేనేజర్ విజయానంద్, క్యాషియర్ కిరణ్, దివ్య, కుష్బూ, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం విద్యార్థులకు తాము నిర్వహిస్తున్న విధుల గురించి వివరించారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



తంప్లూర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

టేక్మాల్(మెదక్): జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అభివృద్ధి అధికారి సంతోష్ ఆధ్వర్యంలో టేక్మాల్ మండలం తంప్లూర్ గ్రామంలో ఆయిల్‌పాం సాగుపై శుక్రవారం అవగాహన కల్పించారు. మండల క్షేత్ర స్థాయి అధికారి శంకర్ రైతులతో ఆయిల్‌పామ్ సాగు ఆవశ్యతపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చునన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని 33కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరాఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ స్వామి తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలి



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

కొల్చారం(నర్సాపూర్): భూ భారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ కొల్చారం తహసీల్దార్‌ను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. భూ భారతి పెండింగ్ దరఖాస్తులను, భూ రికార్డులను, హాజరు పుస్తకాల్ని పరిశీలించారు. వివిధ భూ సమస్యలతో కార్యాలయానికి వచ్చిన భూ బాధితులతో మాట్లాడి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యలతో వచ్చిన ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి వారి సమస్యలకు పరిష్కారాన్ని సూచించాలన్నారు. భూ సమస్యల వల్ల ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులు వారికి అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్ చారి, డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్, ఆర్‌ఐ ప్రభాకర్ ఉన్నారు.

నకిలీ విత్తనాలతో నట్టేట ముంచారు

సదరు కంపెనీపై చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్



దెబ్బతిన్న పొలాన్ని చూపుతున్న రైతులు

హవేళిఘణాపూర్(మెదక్): తమ కంపెనీ సీడ్ వాడితే అధిక దిగుబడి వస్తుందని నమ్మిన రైతులను ఓ కంపెనీ నకిలీ విత్తనాలు ఇచ్చి మోసం చేసిందని మండల పరిధిలోని ఫరీద్‌పూర్ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని ఫరీద్‌పూర్‌కు చెందిన కొందరు రైతులు దాదాపు 10ఎకరాలు లక్ష్మీమెహర్ అనే సీడ్‌ను వాడి సాగు చేశారు. పొట్టదశలో ఉన్న పొలం మొత్తం పొల్లు కావడంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటతో నష్టపోయామని, అధికారులు సదరు కంపెనీపై చర్య తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న డీఏఓ దేవ్‌కుమార్ పంటను పరిశీలించారు. నివేదిక వచ్చిన తర్వాత రైతులకు న్యాయం చేసేలా చూస్తామని హామీనిచ్చారు.

ఈ టీచర్ మాకొద్దు

- కన్నారం ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థుల ధర్నా
- ప్రధానోపాధ్యాయుడికి గ్రామస్తుల ఫిర్యాదు

కౌడిపల్లి(నర్సాపూర్): ఈ టీచర్ మాకొద్దంటూ విద్యార్థులు ధర్నా చేశారు. ఈ ఘటన కౌడిపల్లి మండలం కన్నారం ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలోని ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంతో కలిపి ఎనిమిది మంది ఉపాధ్యాయులు, 97మంది విద్యార్థులు ఉన్నారు. ఫిజికల్‌సైన్స్ బోధించే ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌గౌడ్ క్లాస్ సరిగా చెప్పడని, అర్థం కాలేదని అడిగితే బెదిరించడతో పాటు తోటి విద్యార్థులతో చెంపలపై కొట్టిస్తున్నాడని అన్నారు. గురువారం సంతోష్ అనే విద్యార్థినిని మరోవిద్యార్థితో కొట్టించాడు. నెమ్మదిగా కొట్టడంతో గట్టిగా కొట్టాలని లేకపోతే ఆడపిల్లలతో చెప్పుతో కొట్టిస్తానని బెదిరించడంతో గట్టిగా కొట్టడంతో అతను కిందపడినట్లు చెప్పారు. స్కూల్‌కు వచ్చి యూనియన్ లీడర్ నంటూ ఫోన్ చూస్తూ టైంపాస్ చేస్తాడని అడిగితే బెదిరిస్తాడని ఆరోపించారు. ఈ ఉపాధ్యాయుని ప్రవర్తన కొన్నేళ్లుగా ఇలాగే ఉండటంతో డీఈఓకు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయిన చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో విద్యార్థులు శుక్రవారం ప్లకార్డులు పట్టుకుని ధర్నా చేశారు. ఈ సారుంటే క్లాస్‌కు వెళ్లమని పాఠశాలకు రామని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడ్ని నిలదీయడంతోపాటు హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశారు. విషయం తెలువడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ధర్నా విరమింపచేశారు. ఈ విషయమై హెచ్‌ఎం శేషాద్రికుమార్ మాట్లాడుతూ గ్రామస్తుల ఫిర్యాదును డీఈఓకు తెలియచేస్తామని చెప్పారు. ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌గౌడ్‌ను వివరణ కోరగా తన విధులను మాత్రమే నిర్వహించానని ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలగచేయలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు విఠల్, యాదుల్, పోచయ్య, నారాయణ, శివరాజ్, ప్రమీళ, లత, స్వరూప, సత్యాగౌడ్, బాలాగౌడ్, మహిపాల్‌రెడ్డి, జహంగీర్ పాల్గొన్నారు.



కన్నారం ఉన్నత పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా నర్సాపూర్

ఎమ్మెల్యే సునీతారెడ్డి



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: నర్సాపూర్- హైదరాబాద్ జాతీయ రహదారిని ఆనుకుని నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయంతో నర్సాపూర్ పట్టణం ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఆలయ నిర్మాణ పనులను శుక్రవారం ఆలయ కమిటీ చైర్మన్ అశోక్‌గౌడ్, ఇతర కమిటీ సభ్యులతో కలిసి ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయం అందిస్తానన్నారు. వచ్చే నెల 26న విగ్రహ ప్రతిష్ఠ జరపాలని నిర్ణయించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్‌గౌడ్ ఆమెకు తెలిపారు. అందుకు అనుగుణంగా పనులు చేపడుతున్నామని ఆయన వివరించారు.

సాగులో ముందస్తు జాగ్రత్తలు కీలకం

లయోలా అకాడమీ వ్యవసాయ విద్యార్థులు



మ్యాప్ చూపుతూ రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రతి రైతుకు వ్యవసాయ సమాచారం గురించి తెలిస్తే సాగులో సరైన జాగ్రత్తలు పాటించే అవకాశం ఉంటుందని, అనుకూలమైన పంటలు సాగు చేసే వీలుంటుందని లయోలా అకాడమీ వ్యవసాయ విద్యార్థులు అన్నారు. కేవీకే తునికి శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో మండలంలోని శీలాంపల్లి గ్రామంలో శుక్రవారం గ్రామీణ విశ్లేషణాత్మక సదస్సు నిర్వహించారు. గ్రామం, నేలలు, పంటలసాగు, రైతు వాడిన ఎరువులు వాటి గురించి మ్యాప్ వేసి, రైతులకు గ్రామస్థితి గురించి అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ పంటసాగులలో వస్తున్న నూతన పద్ధతులను ముందుగానే రైతులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు శ్రీదివ్య, ఉషశ్రీ, రుచిత, అరుణజ్యోతి, రైతులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ ఫారమ్ ఎదుట గ్రామస్తుల ధర్నా

నర్సాపూర్‌రూరల్: విద్యార్థులు, ఉపాధ్యాయుల అనారోగ్యాలకు కారణమవుతున్న పౌల్ట్రీ ఫారాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ నర్సాపూర్ మండలంలోని కాగజ్ మద్దూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట ఉన్న పౌల్ట్రీ ఫారమ్ ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కలిసి శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల ఎదుటనున్న పౌల్ట్రీ ఫారమ్ నుంచి దుర్వాసన వెదజల్లడంతో పిల్లలు, ఉపాధ్యాయులు వాంతులు, విరోచనాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మంచు కురిసే వేళ..

మండల కేంద్రమైన కౌడిపల్లిలో శుక్రవారం ఉదయం మంచు కురవడంతో వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం ఏడున్నర గంటల తర్వాత కూడా మంచు కురిసింది. దీంతో జాతీయ రహదారిపై వాహనాలు లైట్లు వేసుకొని వెళ్లాయి.

– కౌడిపల్లి(నర్సాపూర్):



కౌడిపల్లిలో కమ్ముకున్న మంచు